సాక్షి
అనంతపురం
శుక్రవారం । 12 । జనవరి । 2024



అప్రమత్తంగా ఉండాలి

ఎన్నికల వేళ జిల్లాలోని పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ సూచించారు.

8లో



కిలో టమాట రూ.16

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్ఠంగా రూ.16, కనిష్ఠంగా రూ.6, సరాసరిన రూ.12 ప్రకారం ధర పలికింది.

గరిష్ఠం/కనిష్ఠం
33.1°/18.4°

జిల్లా అంతటా గురువారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం వేళ చలి తీవ్రత కొనసాగుతోంది. గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో ఆగ్నేయం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

పకడ్బందీగా రేషన్ పంపిణీ

- డీఎస్ఓ శోభారాణి



ఉరవకొండలో రేషన్ పంపిణీని పరిశీలిస్తున్న డీఎస్ఓ శోభారాణి

ఉరవకొండ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఇంటి వద్దకే రేషన్ బియ్యం పంపిణీని పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారిణి (డీఎస్ఓ) శోభారాణి సూచించారు. గురువారం ఉరవకొండ పట్టణంలోని అంబేడ్కర్ నగర్, రంగావీధిలో ఇంటి వద్దకే రేషన్ బియ్యం పంపిణీని ఆమె పరిశీలించారు. రోజూ ఎన్ని కార్డులకు బియ్యం అందిస్తున్నారు, రాగులు, చక్కెర, బ్యాళ్లు, జొన్నలు అందిస్తున్నారా లేదా అంటూ ఎండీయూ ఆపరేటర్‌తో ఆరా తీశారు. కార్డుదారులతో మాట్లాడారు. కాలనీని బియ్యం వాహనం సరిగానే వస్తోందా, నిత్యావసర సరుకులు ఇస్తున్నారా లేదా అంటూ అడిగి తెలుసుకున్నారు. ఎండీయూ ఆపరేటర్లు ప్రతి నెలా బియ్యంతో పాటు ఇతర సరుకులు ప్రజలకు తప్పకుండా అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఉరవకొండ సీఎస్‌డీటీ కంబక్క తదితరులు పాల్గొన్నారు.

19 నుంచి కులగణన సర్వే

అనంతపురం అర్బన్: జిల్లాలో కులగణన సర్వే ఈనెల 19వ తేదీ నుంచి ప్రారంభించనున్నట్లు కలెక్టర్ ఎం.గౌతమి తెలిపారు. ఇందుకు సంబంధించి వివరాలను గురువారం ఆమె వెల్లడించారు. కులగణన సర్వే జిల్లాలో ఈనెల 19 నుంచి 28వ తేదీ వరకు చేపడతామన్నారు. వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు ఇంటింటికి వెళ్లి సర్వే చేస్తారని, ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

కుష్టు వ్యాధి నిర్మూలనకు చిత్తశుద్ధితో పనిచేయాలి



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న జాయింట్ డైరెక్టర్ డాక్టర్ దేవసాగర్

అనంతపురం మెడికల్: కుష్టు వ్యాధి నిర్మూలనకు వైద్య సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేయాలని రాష్ట్ర లెప్రసీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ దేవసాగర్ పేర్కొన్నారు. గురువారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కుష్టు వ్యాధి సర్వే పక్కాగా చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ ఈ భ్రమరాంబదేవి, జిల్లా కుష్టు వాధి నిర్మూలన అధికారి డాక్టర్ అనుపమజేమ్స్, డాక్టర్ గంగాధర్ రెడ్డి, పీఎంఓ నాగన్న, హెచ్ఈఓ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నిర్మూలనకు చర్యలు

బుక్కరాయసముద్రం/రాప్తాడు: కుష్టు వ్యాధి నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని రాష్ట్ర లెప్రసీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ దేవసాగర్ పేర్కొన్నారు. గురువారం బుక్కరాయసముద్రం, రాప్తాడు ఆరోగ్య కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. కుష్టు వ్యాధి లక్షణాలపై గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా లెప్రసీ అధికారి డాక్టర్ గంగాధర్, డాక్టర్లు శ్రావణి, లక్ష్మి స్వాతి తదితరులు పాల్గొన్నారు.

త్వరలో కార్లు, ఆటోలకు ఏజీపీ గ్యాస్



స్థలాన్ని పరిశీలిస్తున్న జేసీ కేతన్‌గార్గ్

రాప్తాడు: కార్లు, ఆటోలకు త్వరలోనే ఏజీపీ గ్యాస్ అందుబాటులోకి వస్తుందని జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ పేర్కొన్నారు. రాప్తాడు సర్వే నంబర్ 501-2బీ,సీలోని 1.38 ఎకరాల్లో ఎల్‌సీఎన్‌జీ స్టేషన్ ఏర్పాటుకు ఏజీపీ సిటీ గ్యాస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకుంది. ఈ క్రమంలోనే గురువారం క్షేత్ర స్థాయిలో స్థలాన్ని జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 44వ జాతీయ రహదారిపై నిత్యం బెంగళూరు, హైదరాబాద్‌కు వాహనాలు వెళ్తుంటాయన్నారు. ఏజీపీ ద్వారా భవిష్యత్తులో కార్లు, ఆటోలకు ఎల్‌పీజీ అందుబాటులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో డీఎస్ఓ శోభా రాణి, తహసీల్దార్లు మునివేలు, రామాంజనేయులు, సివిల్ సప్లయీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారుల్లో వెలుగు

- 'జగనన్న తోడు' సాయం విడుదల
- జిల్లాలో 18,958 మందికి రూ.19.67 కోట్ల రుణాలు
- 22,803 మంది లబ్ధిదారులకు రూ.59.45 లక్షల వడ్డీ జమ
- సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్



లబ్ధిదారులకు మెగా చెక్కు అందజేస్తున్న కలెక్టర్ గౌతమి, ప్రజాప్రతినిధులు

అనంతపురం: చిరు వ్యాపారులకు ప్రభుత్వం వెలుగులు పంచుతోంది. 'జగనన్న తోడు' పథకం ద్వారా అండగా నిలుస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గురువారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వరుసగా ఎనిమిదో దఫా 'జగనన్న తోడు' రుణాలను కంప్యూటర్ బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాలకు జమ చేశారు. కార్యక్రమాన్ని స్థానిక కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ ఎం. గౌతమి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, రాష్ట్ర నాటక అకాడమీ చైర్‌పర్సన్ సీహెచ్ ప్రమీల, ఆర్టీసీ జోనల్ చైర్ పర్సన్ మాల్యవంతం మంజుల, మేయర్ వసీం సలీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్ఎం. ఉమాదేవి, జిల్లా మైనార్టీ చైర్ పర్సన్ సైఫుల్లా, మార్కెట్ యార్డ్ చైర్‌పర్సన్ ఫయాజ్, డీఆర్‌డీఏ పీడీ ఐ. నరసింహా రెడ్డి, మెప్మా పీడీ విజయలక్ష్మి తదితరులు వీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఎం. గౌతమి మాట్లాడుతూ.. జిల్లాలో 'జగనన్న తోడు' పథకం కింద 18,598 మందికి రూ.19.67 కోట్ల రుణాలు పంపిణీ చేశామన్నారు. గ్రామీణ ప్రాంత లబ్ధిదారులు 12,309 మంది, పట్టణ ప్రాంతాలకు సంబంధించి 6,289 మంది ఉన్నారన్నారు. అలాగే 22,803 మంది లబ్ధిదారులకు రూ.59.45 లక్షల వడ్డీ రీయింబర్స్ చేశామన్నారు. గ్రామీణ ప్రాంత లబ్ధిదారులకు రూ.39.05 లక్షలు, పట్టణ ప్రాంత లబ్ధిదారులకు వడ్డీ రీయింబర్స్‌మెంట్ అయిందన్నారు. ప్రభుత్వ సాయాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ.. చిరు వ్యాపారులు, హస్త కళాకారులు, సంప్రదాయ చేతి వృత్తుల వారు వడ్డీ వ్యాపారుల చుట్టూ తిరగాల్సిన దుస్థితిని ప్రభుత్వం పారద్రోలిందన్నారు. అనంతరం లబ్ధిదారులకు మెగా చెక్ అందించారు.

మూడు సార్లు ఆదుకున్నారు



బొమ్మల డ్రాయింగ్‌తో కుటుంబాన్ని పోషించుకుంటున్నా. చిరు వ్యాపారులకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. 'జగనన్న తోడు' పథకం కింద 3 సార్లు లబ్ధి కలిగింది. తీసుకున్న అప్పును నెలనెలా సరైన సమయంలో కడుతుంటే వడ్డీ కూడా అందించారు. మాలాంటి వారికి భరోసా కల్పిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు.

– ఎ. పుష్పావతి, లబ్ధిదారు, అనంతపురం

ఏడుగురు సీఐల బదిలీ



అనంతపురం క్రైం: జిల్లాలోని పలు స్టేషన్లలో పనిచేస్తున్న ఏడుగురు సీఐలకు స్థాన చలనం కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. అనంతపురం రేంజ్ పరిధిలోని అనంతపురం సీసీఎస్ పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న జీటీ నాయుడును అనంతపురం సోషల్ మీడియా, సైబర్ క్రైం సెల్ బదిలీ చేశారు. అదేవిధంగా శింగనమల సీఐ అస్రార్ బాషాను తిరుపతి (వీఆర్)కు, అనంతపురం 'దిశ' సీఐ టి.చిన్న గోవిందును చిత్తూరు(వీఆర్)కు, రాయదుర్గం సీఐ బి.లక్ష్మన్నను తిరుపతి(వీఆర్)కు బదిలీ చేశారు. ఇక బుక్కరాయసముద్రం అప్‌గ్రేడ్ స్టేషన్‌కు అటాచ్‌మెంట్ కింద వచ్చి సీఐ జి.వెంకటేశులుకు అక్కడే పోస్టింగ్ ఇచ్చారు. కళ్యాణదుర్గం రూరల్ సర్కిల్ అప్‌గ్రేడ్ స్టేషన్‌లో పనిచేస్తున్న సీఐ ఎస్‌వీ నాగరాజును కూడా అక్కడే పోస్టింగ్ ఇచ్చారు. ప్రస్తుతం అనంతపురం ఎస్సీ, ఎస్టీ సెల్ సీఐ జాకీర్ అటాచ్‌మెంట్‌పై స్పెషల్ బ్రాంచ్ సీఐగా కొనసాగుతుండగా, ఆయన్ను తిరిగి ఎస్సీ, ఎస్టీ సెల్ సీఐగా నియమించారు.

విధేయతకు పట్టం

- 'రాయదుర్గం' వైఎస్సార్ సీపీ సమన్వయకర్తగా 'మెట్టు'
- పార్టీ శ్రేణులు, అభిమానుల ఆనందోత్సాహాలు





సంబరాలు చేసుకుంటున్న పార్టీ శ్రేణులు (ఇన్‌సెట్‌లో) మెట్టు గోవింద రెడ్డి

రాయదుర్గం: నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్తగా మెట్టు గోవింద రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయం గురువారం ఉత్తర్వులు విడుదల చేసింది. సుదీర్ఘ కసరత్తు తర్వాత పార్టీ అధిష్టానం విధేయతకే పట్టం కట్టింది. దీంతో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ఆయన అభిమానులు సంబరాలు చేసుకున్నారు. రాయదుర్గం వినాయక సర్కిల్‌లో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, పొరాళ్ల శివ ఆధ్వర్యంలో టపాసులు కాల్చారు. జై జగన్ అంటూ నినాదాలు చేశారు. పలువురు నాయకులు మెట్టు గోవింద రెడ్డి ఇంటి వద్దకు వెళ్లి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. స్వీట్లు తినిపించి ఆనందం పంచుకున్నారు.

ప్రజల్లో ప్రత్యేక గుర్తింపు

మెట్టు గోవింద రెడ్డి జిల్లా ప్రజలకు సుపరిచితుడు. సౌమ్యుడిగా, అందరివాడిగా మన్నన చూరగొన్నారు. రాయదుర్గం నియోజకవర్గవ్యాప్తంగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఐదు మండలాల్లోనూ తనకంటూ ఓ కేడర్ ఉంది. పార్టీకి ఆయన అందించిన సేవలను గుర్తించిన సీఎం జగన్ ఏపీఐఐసీ చైర్మన్‌గా నియమించి సముచిత స్థానం కల్పించారు. ఈ క్రమంలోనే రాయదుర్గం వైఎస్సార్ సీపీ సమన్వయకర్తగా అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా మెట్టు గోవింద రెడ్డి 'సాక్షి'తో మాట్లాడారు. తనను సమన్వయకర్తగా ఎంపిక చేయడం సంతోషం కలిగించిందన్నారు. వచ్చే ఎన్నికల్లో రాయదుర్గం నియోజకవర్గంలో భారీ మెజార్టీతో విజయం సాధించి ముఖ్యమంత్రికి కానుక ఇస్తామన్నారు. సీఎం జగన్, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, పార్టీ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి తనపై ఉంచిన నమ్మకాన్ని నిలుపుకుంటానని పేర్కొన్నారు.

అంబేడ్కర్ ఆశయసాధనకు సీఎం జగన్ కృషి

- 125 అడుగుల విగ్రహం ప్రపంచానికే దిక్సూచి
- ఎమ్మెల్యేలు అనంత వెంకటరామిరెడ్డి, శంకర నారాయణ
- అంబేడ్కర్ విగ్రహావిష్కరణ పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లు విడుదల చేస్తున్న ఎమ్మెల్యేలు అనంత వెంకటరామిరెడ్డి, శంకరనారాయణ, తదితరులు

అనంతపురం కార్పొరేషన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యేలు అనంత వెంకటరామిరెడ్డి, శంకర్ నారాయణ తెలిపారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా విజయవాడలో 125 అడుగుల అతిపెద్ద అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకున్నారని, ప్రపంచానికే ఈ విగ్రహం దిక్సూచిగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ నెల 19న విజయవాడలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆవిష్కరణకు సంబంధించిన పోస్టర్లను ఎమ్మెల్యేలు ఆవిష్కరించారు. స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయం వద్ద కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనంత మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో విజయవాడలో రూ.404 కోట్లతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రాజ్యాంగపరంగా అందరూ సమానమేనని చెప్పడమే కాకుండా హక్కుల సాధనకు అంబేడ్కర్ కృషి చేశారన్నారు. అలాంటి మహనీయుడి ఆశయాలను సీఎం వైఎస్ జగన్ కొనసాగిస్తూనే, సమ సమాజ స్థాపనకు చర్యలు తీసుకున్నారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఎస్సీల అభ్యున్నతికి రూ.58 వేల కోట్లు ఖర్చు చేశారన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ కార్పొరేషన్లు ఏర్పాటు చేసి రాజ్యాంగబద్ధమైన పదవులిచ్చారన్నారు. ఈ నెల 18 వరకూ గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో కార్యక్రమాలను నిర్వహించి, ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు విగ్రహావిష్కరణకు హాజరయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ అనంతపురం పార్లమెంట్ సమన్వయకర్త మాలగుండ్ల శంకరనారాయణ మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతి, హక్కులు, రిజర్వేషన్ల కోసం అంబేడ్కర్ ఎంతగానో శ్రమించారన్నారు. ఆయన ఆలోచనలు, సిద్ధాంతాలు పుణికి పుచ్చుకుని అమలు చేస్తున్న వ్యక్తి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని కొనియాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సర్పంచ్ నుంచి మంత్రి స్థాయి వరకు రిజర్వేషన్‌తో సంబంధం లేకుండా 70 శాతానికి పైగా పదవులు కల్పించి సామాజిక విప్లవాన్ని సృష్టించారన్నారు. మేయర్ వసీం మాట్లాడుతూ గతంలో చంద్రబాబు అమరావతిలో స్మృతివనం ఏర్పాటు చేస్తామని విస్మరించారన్నారు. తమ ప్రభుత్వం విజయవాడలో అంబేడ్కర్ భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తోందన్నారు. పార్టీ అధ్యక్షుడు పైలా నరసింహయ్య మాట్లాడుతూ బడుగులు అన్ని విధాల అభివృద్ధి చెందేలా సీఎం జగన్ చర్యలు తీసుకున్నారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల, వక్ఫ్‌బోర్డు జిల్లా చర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, పార్టీ బీసీ, సాంస్కృతిక విభాగం జోనల్ ఇన్‌చార్జ్‌లు రమేష్‌గౌడ్, రిలాక్స్ నాగరాజు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, పార్టీ సీనియర్ నేత చింతా సోమశేఖర్ రెడ్డి, అనుబంధ సంఘాల అధ్యక్షులు ఎగ్గుల శ్రీనివాసులు, సైఫుల్లాబేగ్, కార్పొరేటర్లు సాకే చంద్ర, రహంతుల్లా, చంద్రలేఖ, ఎస్సీ సెల్ నేత పెన్నోబిలేసు, నాయకులు కృష్ణవేణి, రాధాయాదవ్, ఉషరాణి, ఉష, మిద్దె నగేష్, జావెద్, అనిల్‌కుమార్‌గౌడ్, రాధాకృష్ణ, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా దరఖాస్తుల పరిశీలన

అనంతపురం అర్బన్: ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ క్రమంలో అందిన ప్రతి దరఖాస్తును పక్కాగా పరిశీలించి పరిష్కరించామని కలెక్టర్ ఎం.గౌతమి స్పష్టం చేశారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో డీఆర్ఓ గాయత్రిదేవితో కలిసి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 22న తుది ఓటర్ల జాబితా విడుదల చేస్తామన్నారు. ఎన్నికల్లో దివ్యాంగులు, 80 ఏళ్ల వయసు పైబడిన వారు తమ ఓటును ఇంటి నుంచే వినియోగించుకునే అవకాశం కల్పిస్తామన్నారు. కొత్తగా ఓటరు నమోదుకు (ఫారం-6) దరఖాస్తులు 1,35,684 రాగా, 1,18,633 క్లెయింలు ఆమోదించామని, 17,047 తిరస్కరించామన్నారు. ఓటు తొలగింపునకు (ఫారం-7) దరఖాస్తులు 1,17,825 రాగా 86,775 ఆమోదించామని, 30,974 క్లెయిమ్‌లు తిరస్కరించామన్నారు. ఫారం-8 దరఖాస్తులు 1,27,750 రాగా 1,20,858 ఆమోదించామని, 6,888 తిరస్కరించినట్లు వెల్లడించారు. ఫొటో సిమిలర్ ఎంట్రీస్ 18,857 రాగా 17,163 పరిష్కరించామని, 1,694 పరిష్కరించాల్సి ఉందన్నారు. డెమోగ్రాఫికల్ సిమిలర్ ఎంట్రీస్ 3,096 రాగా 2,905 పరిష్కరించామని, 191 పరిష్కరించాల్సి ఉందన్నారు.

ఏఎల్ఎంటీలకు శిక్షణ

సార్వత్రిక ఎన్నికల నిర్వహణ, ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు, నిబంధనలపై అసెంబ్లీ లెవల్ మాస్టర్ ట్రైనీలకు (ఏఎల్ఎంటీ)ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అంశాలవారీగా డిప్యూటీ కలెక్టర్ విశ్వనాథ్, డిస్ట్రిక్ లెవల్ మాస్టర్ ట్రైనీలు హరికుమార్, మహబూబ్‌బాషా, మోహన్‌కుమార్, ఉషారాణి, వాణిశ్రీలు వివరించారు.

అమరావతి ఎక్స్‌ప్రెస్ పొడిగింపు

గుంతకల్లు: హుబ్లీ–విజయవాడ మధ్య నడిచే అమరావతి ఎక్స్‌ప్రెస్‌ను నర్సాపూర్ వరకూ పొడిగించినట్లు డివిజన్ కార్యాలయ అధికారులు తెలిపారు. ప్రయాణికుల సౌకర్యార్థం జోనల్ వ్యాప్తంగా మూడు ఎక్స్‌ప్రెస్ రైళ్ల సర్వీసులను పొడిగించి శుక్రవారం నుంచి అందుబాటులోకి తెచ్చారు. అందులో భాగంగా విజయవాడ-హుబ్లీ (వయా గుంతకల్లు) మధ్య నడిచే (17255/26 నంబర్లతో) ఎక్స్‌ప్రెస్ ఇక నుంచి నర్సాపూర్ వరకూ నడవనుంది. నర్సాపూర్ జంక్షన్‌లో (17255) రోజూ సాయంత్రం 4.10 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 11.20 గంటలకు హుబ్లీ జంక్షన్‌కు చేరుకోనుంది. ఇదే రైలు (17226) హుబ్లీ జంక్షన్ నుంచి మధ్యాహ్నం 1.20 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7.40 గంటలకు నర్సాపూర్ చేరుకుంటుందని అధికారులు వెల్లడించారు.

స్టెమీతో గుండెపోటు మరణాల నియంత్రణ

- డీసీహెచ్‌ఎస్ డాక్టర్ పాల్ రవికుమార్

కణేకల్లు: స్టెమీ ప్రాజెక్టు ద్వారా గుండెపోటు మరణాల నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని డీసీహెచ్‌ఎస్ డాక్టర్ పాల్ రవికుమార్ పేర్కొన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 22 సీహెచ్‌సీల్లో ప్రాజెక్టు సేవలు ప్రారంభించనున్నట్లు చెప్పారు. కణేకల్లు సీహెచ్‌సీని గురువారం డీసీహెచ్‌ఎస్ సందర్శించారు. జనరల్ వార్డు, మైనర్ ఓటీ రూమ్, క్యాజువాలిటీ గది, ఆపరేషన్ థియేటర్‌ను తనిఖీ చేశారు. సేవలపై రోగులను అడిగి తెలుసుకొన్నారు. వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆస్పత్రిలో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ డాక్టర్లందరూ తప్పక విధుల్లో ఉండాలన్నారు. ఓపీ సేవలు ముగిసిన తర్వాత కచ్చితంగా ఒక డాక్టర్ డ్యూటీలో ఉండాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీ సేవల ఖర్చును భారీగా పెంచిందని, ఈ విషయాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ఆరోగ్యమిత్రలు సంధ్య, సుధలను ఆదేశించారు. గుండె బాధతో ఆస్పత్రి కొచ్చే వారికి వెంటనే ఈసీజీ తీసి, అనంతపురం సర్వజనాస్పత్రిలో ఉండే కార్డియాలజిస్ట్ డాక్టర్‌కు యాప్ ద్వారా పంపాలని సూచించారు. అనంతరం ఆయన సూచనల మేరకు చికిత్స అందించాలన్నారు. సీహెచ్‌సీల్లో పారా మానిటర్ ఎక్విప్‌మెంట్లు (విలువైన ఇంజక్షన్‌లు, ట్యాబెట్లు) సిద్ధం చేసినట్లు చెప్పారు. గుండె సమస్య తీవ్రంగా ఉంటే సర్వజనాస్పత్రి లేదా కిమ్స్, పావని ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ ద్వారా శస్త్ర చికిత్సలు చేయిస్తామన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు నిరీషా, మహమ్మద్ షరీఫ్, మహేంద్ర, హర్షవర్ధన్, ఎం.రాజు, పావని, చంద్రశేఖర్‌నాయక్, ప్రవీణ, జూనియర్ అసిస్టెంట్ ఖాశీంపీరా తదితరులు పాల్గొన్నారు.

క్రీడా సంబరం.. సాంస్కృతిక వైభవం

- ఘనంగా సత్యసాయి విద్యాసంస్థల క్రీడా సమ్మేళనం



సత్యసాయి చిత్రపటాన్ని ఊరేగింపుగా తీసుకువస్తున్న విద్యార్థులు



విలువిద్య విన్యాసాలు నిర్వహిస్తున్న దృశ్యం

ప్రశాంతి నిలయం: ఒళ్లు గగుర్పొడిచే విన్యాసాలు, సనాతన భారతీయ సంస్కృతీ సంప్రదాయాలు ప్రతిబింబించే ప్రదర్శనలు.. వెరసి సత్యసాయి విద్యాసంస్థల క్రీడా సాంస్కృతిక సమ్మేళనం ఘనంగా జరిగింది. గురువారం పుట్టపర్తిలోని హిల్‌వ్యూ మైదానం ప్రేక్షకులతో కిక్కిరిసింది. ఉదయం 8 గంటలకు ప్రశాంతి నిలయంలోని యజుర్ మందిరం నుంచి సత్యసాయి చిత్రపటాన్ని విద్యార్థులు వేదపఠనం, బ్రాస్ బ్యాండ్ నడుమ ప్రత్యేకంగా అలంకరించిన కారుపై ఊరేగింపుగా హిల్‌వ్యూ స్టేడియం వద్దకు తీసుకొచ్చారు. సత్యసాయి డీమ్డ్ యూనివర్సిటీ పరిధిలోని నాలుగు క్యాంపస్‌ల విద్యార్థులు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. అనంతరం విద్యాసంస్థల వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ రాఘవేంద్ర ప్రసాద్ క్రీడా జ్యోతిని వెలిగించి క్రీడా సమ్మేళనం ప్రారంభించారు. ప్రశాంతి నిలయం, ముద్దేనహళ్లి, బృందావన్ క్యాంపస్‌ల విద్యార్థులు ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. సింహనృత్యం, బంగీజంప్, కత్తిసాము, కర్రసాము, జిమ్నాస్టిక్, స్కేటింగ్, జంపింగ్, కరాటేలతో అబ్బురపరిచారు. ఏపీ, గుజరాత్, తమిళనాడు, కేరళ, తదితర రాష్ట్రాల సంస్కృతీ సంప్రదాయాలు ప్రతిబింబిస్తూ నృత్య ప్రదర్శన చేశారు.



బైక్ రైడింగ్ విన్యాసాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

క్లుప్తంగా

పీజీ విద్యార్థిని ఆత్మహత్య


మృతురాలు శ్రీలయ

పామిడి: పట్టణంలోని 1వ వార్డు వీధికి చెందిన పాండురంగరావు కుమార్తె శ్రీలయ (21) గురువారం ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల వివరాలమేరకు... పాండురంగరావు, స్వప్న దంపతులకు శ్రీలయ (21), తేజస్విని సంతానం. శ్రీలయ అనంతపురం ఎస్కేయూలో ఎమ్మెస్సీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతోంది. దీంతో విద్యపై ఏకాగ్రత పెట్టలేకపోయింది. చిన్న కుమార్తె తేజస్విని అనారోగ్యానికి గురికావడంతో గురువారం తల్లిదండ్రులు స్థానిక కమ్యూనిటీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ సమయంలోనే శ్రీలయ ఇంట్లో ఉరివేసుకుంది. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇంటర్ విద్యార్థి మృతి

తాడిపత్రి: మండల పరిధిలోని వెంకటరెడ్డి గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో అబ్దుల్ ఘని (17) అనే యువకుడు మృతి చెందాడు. స్థానికుల వివరాలమేరకు... తాడిపత్రి మండల పరిధిలోని బుగ్గ గ్రామానికి చెందిన షరీఫ్ కుమారుడు అబ్దుల్‌ఘని అనంతపురంలోని ఓ ఇంటర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. సంక్రాంతి సెలవులకు ఇంటికి వచ్చాడు. అబ్దుల్‌గని పని నిమిత్తం గురువారం బుగ్గ నుంచి తాడిపత్రికి బైక్‌పై బయలుదేరాడు. వెంకటరెడ్డిపల్లి గ్రామం వద్ద బైక్ అదుపుతప్పింది. తీవ్రంగా గాయపడగా తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అబ్దుల్‌గని చికిత్స పొందుతూ మృతి చెందాడు.

ఎన్నికల వేళ అప్రమత్తంగా ఉండాలి

- పోలీసులపై ప్రజల్లో నమ్మకాన్ని పెంచాలి
- అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కు పాదం మోపండి
- నేర సమీక్షలో ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్


నేర సమీక్షలో పాల్గొన్న పోలీసు అధికారులు


మాట్లాడుతున్న ఎస్పీ అన్బురాజన్

అనంతపురం క్రైం: ఎన్నికల వేళ జిల్లాలోని పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ సూచించారు. గురువారం నగరంలోని పోలీసు కాన్ఫరెన్స్ హాల్‌లో నెలవారి నేర సమీక్ష నిర్వహించారు. ఇందులో భాగంగానే ఎస్పీ అధికారులు, సిబ్బందికి పలు సూచనలు, సలహాలిచ్చారు. తీవ్రమైన కేసులు, పోలీసుస్టేషన్ల నిర్వహణ, శాంతి భద్రతల పరిరక్షణ, తదితర అంశాలతో పాటు డయల్ – 100, పీసీఆర్, బ్లూకోర్ట్స్, రక్షక్ వాహనాలపై, డీపీఓకు వచ్చిన అన్ని రకాల పెండింగ్ పిటీషన్లపై ముందుగా ఎస్పీ సమీక్ష చేశారు.

కేసులు వీగిపోకుండా చర్యలు

ఎస్పీ అన్బురాజన్ మాట్లాడుతూ ఎన్నికలకు ముందస్తు ప్రణాళికలు, చర్యలు అవసరమన్నారు. ఫ్యాక్షన్, సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. క్షేత్రస్థాయి పరిస్థితులకు అనుగుణంగా చట్టపరమై చర్యలు తీసుకోవాలన్నారు. నేర చరిత్ర కలిగిన, ట్రబుల్ మాంగర్స్‌పై ప్రత్యేక నిఘా కొనసాగించాలన్నారు. సత్ప్రవర్తనతో జీవించాలని లేదంటే చట్టపరమైన చర్యలు తప్పవని సూచించాలన్నారు. గ్రేవ్ కేసుల్లో త్వరితగతిన దర్యాప్తు ముగించి కోర్టుల్లో నంబర్లు తీసుకోవాలన్నారు. ఆయా కేసుల్లో తప్పనిసరిగా నిందితులకు శిక్షలు పడేలా చూడాలని సూచించారు. కేసులు వీగిపోకుండా గట్టిగా పని చేయాలన్నారు. బాధితులకు న్యాయం జరగాలంటే నేరం జరిగాక సంఘటనా స్థలం పరిశీలన, సాక్ష్యాధారాల సేకరణ, కేసు నమోదు, నిందితుల అరెస్టు, దర్యాప్తు, చార్జ్‌షీటు దాఖలు, కోర్టు ట్రయిల్స్ వరకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో సూచించారు.

రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా

చీటింగ్ కేసులు, దొంగతనాల కేసుల ఛేదింపుకు కృషి చేయాలని ఎస్పీ సిబ్బంది ఆదేశించారు. ఆ కేసుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే పోలీసులపై నమ్మకం సన్నగిల్లుతుందన్నారు. ఎస్‌బీడబ్ల్యూలు పక్కాగా అమలు చేయాలన్నారు. రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. వారు సత్ప్రవర్తనతో మెలిగేలా కౌన్సిలింగ్ ఇవ్వాలని తెలిపారు. జిల్లాలో ప్రశాంతత, శాంతిభద్రతల పరిరక్షణకు హోదా మరచి అందరం కలిసి సమిష్టిగా పని చేద్దామని పిలుపునిచ్చారు. ప్రాపర్టీ నేరాల నియంత్రణపై దృష్టి సారించాలన్నారు. విజిబుల్ పోలీసింగ్ పెంచాలన్నారు. బీట్స్ రీఆర్గనైజ్ చేయాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలను నియంత్రించాలని, ఇందుకు కోసం అందరూ కష్టపడాలని సూచించారు.

ఇసుక, అక్రమ మద్యానికి చెక్

ఇసుక, అక్రమ మద్యం రవాణాలకు చెక్ పెట్టాలని ఎస్పీ అన్బురాజన్ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. నగదు, విలువైన ఆభరణాల అక్రమ తరలింపు కూడా జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. గంజాయిపై నిఘా ఉంచాలన్నారు. ఎక్కడా విక్రయాలు జరకుండా చూడాలని సూచించారు. పొరుగు రాష్ట్రం నుంచి వచ్చే అక్రమ పెట్రోల్ అమ్మకాలు నియంత్రించాలన్నారు. జిల్లాలో మట్కా, పేకాట, క్రికెట్ బెట్టింగులకు తావులేకుండా కఠిన చర్యలు చేపట్టాలన్నారు. మట్కా బీటర్ నుంచి నిర్వాహకుల వరకూ ఎవరినీ ఉపేక్షించకూడదన్నారు.

ప్రజలకు న్యాయం చేయాలి

వివిధ సమస్యలపై ఎంతో నమ్మకంతో పోలీసుస్టేషన్‌కు వచ్చే ప్రజల సమస్యలను సావధానంగా వినాలని ఎస్పీ సూచించారు. వారికి చట్ట పరిధిలో న్యాయం జరిగేలా చూడాలన్నారు. సామాన్య ప్రజల సమస్యలు, బాధలను సులువుగా తీసుకోవద్దని హితవు పలికారు. రోడ్డు ప్రమాదాలు, మహిళల సమస్యలు, అఘాయిత్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు వాటి నియంత్రణలో భాగంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. బాల కార్మికులు, బాల్య వివాహాల విషయంలో రాజీ పడకూడదని తెలిపారు. ఈవ్ టీజింగ్, బహిరంగ మద్యపానంపై దృష్టి సారిస్తే దాదాపు నేరాలు నియంత్రించిన వారవుతామన్నారు. బాల్య వివాహాలు, చైల్డ్ లేబర్, చైల్డ్ డ్రాపౌట్స్‌పై మహిళా పోలీసులు దృష్టి సారించాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీలు విజయ భాస్కర్ రెడ్డి, రామకృష్ణ, హనుమంత, డీఎస్పీలు ఆంథోనప్ప, సీఎం గంగయ్య, నరసింగప్ప, ప్రసాదరెడ్డి, మునిరాజా (ఏఆర్), ట్రైనీ డీఎస్పీ హేమంత్ కుమార్, జిల్లా పోలీసు పరిపాలనాధికారి శంకర్, సూపరింటెండెంట్ శ్రీనివాసులు, లీగల్ అడ్వయిజర్ విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లాలోని సీఐలు, ఆర్‌ఐలు, డీపీఓ సిబ్బంది పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని అన్ని విభాగాల అధికారులతో కలసి సమర్థవంతంగా పని చేద్దామని స్పీ కేకేఎన్ అన్బురాజన్ సిబ్బందికి సూచించారు. నేర సమీక్ష అనంతరం జిల్లాలోని పోలీసు, సెబ్, ఎక్సైజ్, ఆర్టీఏ, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్, అటవీశాఖ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. స్టాటిక్ చెక్ పోస్టులు, డైనమిక్ చెక్ పోస్టుల్లో సమన్వయంతో పని చేద్దామన్నారు.

ఉత్తమ సేవలకు అభినందన


ఎస్పీ చేతులు మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న కానిస్టేబుల్ హరికృష్ణ

అనంతపురం క్రైం: ప్రజల మాన, ధన, ప్రాణాలను రక్షించడంలో ఉత్తమ సేవలందించిన 74 మంది పోలీసు సిబ్బందిని ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ అభినందించారు. నేరసమీక్ష అనంతరం గత నెల ఉత్తమ సేవలు అందించిన జిల్లాలోని పోలీసు అధికారులు, సిబ్బందిని, గ్రామ మహిళా పోలీసులకు ఎస్పీ ప్రశంసాపత్రాలు అందజేశారు. గత నెల జరిగిన భారీ చోరీ కేసును ఛేదించి రూ. 46.55 లక్షలు రికవరీ చేసిన కేసులో వన్‌టౌన్ సీఐ రెడ్డెప్పను అభినందించారు. అనంతరం ఆయనకు జిల్లా ఎస్పీ ప్రశంసాపత్రాన్ని అందజేశారు. అనంతరం వివిధ రకాల విధుల్లో ఉత్తమ సేవలు అందించిన వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు.

జనవాక్కు

పథకాల లబ్ధి చేకూరింది



వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత అందరి జీవితాలు బాగుపడ్డాయి. మాకూ సంక్షేమ పథకాల లబ్ధి చేకూరింది. నాకు పింఛన్ మంజూరైంది. నా భార్యకు చేయూత పథకం కింద ఏటా రూ.18,750 అందుతోంది. మాలాంటి పేదలందరూ ఇలాంటి పాలకులనే కోరుకుంటారు. అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్న వైఎస్ జగన్‌కే మా మద్దతు.

– కుంటెన్న, కొర్రకోడు, కూడేరు మండలం

సొంతింటి కల సాకారమవుతోంది



నా భర్త పెద్ద గంగయ్య దాదాపు 10 సంవత్సరాల క్రితం మరణించాడు. నేనూ, నా కూతురు ఉంటున్నాం. కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నా. మాకు సొంతిల్లు లేదు. గత టీడీపీ ప్రభుత్వంలో ఎన్నిసార్లు అర్జీలు పెట్టుకున్న మాకు ఇల్లు మంజూరు చేయలేదు. గతంలో ఎవరూ పట్టించుకోలేదు. మాకు ఇల్లు కట్టుకునే అవకాశం లేదేమో అనుకున్నాం . కానీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత గ్రామ వలంటీర్ సహాయంతో మాకు మాగ్రామంలోనే జగనన్న కాలనీలో స్థలంతో పాటు ఇల్లు మంజూరైంది. ఇంటి నిర్మాణం కూడా పూర్తి దశలో ఉంది. త్వరలోనే సొంతింటి కల నెరవేరబోతోంది. జగనన్న మేలు మరువలేం.

– బోయ చిత్తక్క , గొంచిరెడ్డిపల్లి, బ్రహ్మసముద్రం

ఆరోగ్యశ్రీతో పునర్జన్మ



నా వయస్సు 67 సంవత్సరాలు. కేబుల్ వైర్ల తవ్వకం పనులు చేసుకుని కుటుంబాన్ని పోషించేవాళ్లం. కానీ ఉన్నట్లుండి తీవ్రమైన నడుంనొప్పి రావడంతో వైద్యులను సంప్రదించి పలు రకాల వైద్య పరీక్షలు చేయించుకున్నా. కిడ్నీలో సమస్య ఉందని వైద్యులు చెప్పడంతో 2021లో జిల్లా కేంద్రంలోని ఓ ఆస్పత్రిలో చేరాను. ఆపరేషన్‌కు రూ.6,20,000లను ప్రభుత్వమే ఆరోగ్యశ్రీ కింద ఖర్చు చేసింది. ముసలి వయస్సులో ఎవరూపట్టించుకోకపోయినా నేనున్నానని సీఎం జగన్ భరోసా ఇచ్చారు. జగన్ నాకు పునర్జన్మ ఇచ్చారు. నా ప్రాణం ఉన్నంత వరకూ జగన్‌కే నా మద్దతు ఇస్తా.

– బళ్లారి ముత్యాలమ్మ, గుమ్మఘట్ట

ఇంటి వద్దకే సంక్షేమం



కూలి పనికి పోతే తప్ప పూట గడవదు. రోజూ బేల్దారి పనులకు వెళ్లి కుటుంబాన్ని పోషించుకుంటున్నా. గత ప్రభుత్వంలో ప్రభుత్వ పథకాలు అందక తీవ్ర ఇబ్బందులు పడ్డాం. జగన్ ప్రభుత్వం వచ్చాక వలంటీర్లు ఇంటి వద్దకే వచ్చి వివరాలు కనుక్కొని సంక్షేమ పథకాలు అందేలా చేశారు. రైతు భరోసా కింద ఏటా రూ.13,500 ఆర్థిక సాయం అందుతోంది. ఈ డబ్బును పెట్టుబడిగా పెట్టి పంటలు సాగు చేస్తున్నా. నా భార్య లక్ష్మీదేవికి వైఎస్సార్ చేయూత పథకం కింద రూ.18,750 మంజూరు చేశారు. అలాగే నా భార్య పేరుతో ఇంటిని మంజూరు చేశారు. దీంతో సొంతింటి కల నెరవేరింది. నా కుమారుడు జయంత్, కుమార్తె సిరి చదువులకూ పథకాలు వర్తింపజేశారు. సీఎం వైఎస్ జగన్ పాలనలో ప్రతి ఇంటికీ మేలు జరిగింది.

– బుడగ పెద్ద లింగమయ్య, గంగలకుంట, రాప్తాడు

కలెక్టర్‌ను కలసిన జెడ్పీ సీఈఓ, కమిషనర్


కలెక్టర్ గౌతమికి మొక్క అందజేస్తున్న జెడ్పీ సీఈఓ నిదియాదేవి


నగర పాలక కమిషనర్ మేఘ స్వరూప్

అనంతపురం అర్బన్: కలెక్టర్ గౌతమిని జిల్లా పరిషత్ సీఈఓగా నియమితులైన నిదియాదేవి, నగర పాలక కమిషనర్ మేఘ స్వరూప్ మర్యాద పూర్వకంగా కలిశారు. గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయానికి వెళ్లారు. ఈ సందర్భంగా కలెక్టర్ గౌతమి మాట్లాడుతూ ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా విధులు నిర్వర్తించాలని సూచించారు.

వేటకొడవళ్లతో వ్యక్తిపై దాడి


గాయపడిన అశోక్‌బాబు

అనంతపురం క్రైం: నగరంలోని బుడ్డప్పనగరులో బుధవారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు హల్‌చల్ చేశారు. ఓ వ్యక్తి కళ్లలో కారం చల్లి వేట కొడవళ్లతో వెంటపడి నరికారు. చనిపోయాడనుకొని అక్కడి నుంచి ఉడాయించారు. కొన ఊపిరితో ఉన్న అతన్ని ఆటోడ్రైవర్లు ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. సమాచారం అందుకున్న వన్‌టౌన్ సీఐ రెడ్డెప్ప, ఎస్‌ఐ వెంకటేశ్వర్లు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధితుడిని జేఎన్‌టీయూ కళాశాల రహదారిలోని తారకనాథనగర్‌కు చెందిన ఆటోడ్రైవర్ అశోక్‌బాబుగా గుర్తించారు. బుధవారం రాత్రి అశోక్‌బాబును అతని పెద్దమ్మ కుమారుడు గోవిందురాజులు ద్విచక్ర వాహనంపై ఎక్కించుకెళ్లాడని , అతర్వాత అన్నయ్య ఇంటికి రాలేదని బాధితుడి సోదరుడు పోలీసుల తెలిపారు. కాగా అతడిపై దాడి చేసేంతటి కారణాలేవి లేవని చెప్పారు. పెద్దమ్మ కుమారుడి సెల్‌ఫోన్ కూడా పనిచేయడం లేదన్నారు. ఇదిలా ఉండగా దాడిలో తీవ్రంగా గాయపడిన అశోక్‌బాబు అపస్మారక స్థితిలోకి వెళ్లాడని వైద్యులు చెబుతున్నారు. కాగా అశోక్‌పై ఎవరు దాడి చేశారన్న దానిపై పోలీసులకు ఎలాంటి ఆధారాలు లభించలేదు.

వైద్యసేవలు నిర్లక్ష్యం చేస్తే చర్యలు


రోగులతో వైద్య సేవలపై ఆరా తీస్తున్న డీసీహెచ్ఎస్ పాల్ రవికుమార్

రాయదుర్గంటౌన్: 'ఆస్పత్రికి వచ్చే రోగులకు వైద్య సేవలు అందించే విషయంలో నిర్లక్ష్యం తగదు. ముఖ్యంగా వైద్యులు అందుబాటులో లేకపోతే శాఖా పరమైన చర్యలు తీసుకుంటాం' అని డీసీహెచ్ఎస్ పాల్ రవికుమార్ పేర్కొన్నారు. గురువారం రాయదుర్గం పట్టణంలోని ఏరియా ఆస్పత్రిని డీసీహెచ్ఎస్ రవికుమార్ తనిఖీ చేశారు. రాయదుర్గం ఏరియా ఆస్పత్రిలో వైద్యులు సమయానికి అందుబాటులో ఉండరనే ఫిర్యాదు కూడా అందినట్లు చెప్పారు. ఈ సందర్భంగా వైద్య సేవలపై రోగులతో ఆరా తీశారు.

ఎద్దుల బండిని ఢీ కొట్టిన బొలెరో

- దొంగల ముఠా సభ్యులుగా అనుమానం


ప్రమాద స్థలంలో గుమికూడిన జనం

విడపనకల్లు: మండల కేంద్రంలో 42వ జాతీయ రహదారిపై ఉన్న భారత్ పెట్రోల్ బంక్ సమీపంలో గురువారం తెల్లవారు జామున ఎద్దులబండిని బొలెరో ఢీ కొంది. దీంతో ఒకరికి తీవ్రగాయాలు అయ్యాయి. రెండు ఎద్దులు అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికుల వివరాలమేరకు.. విడపనకల్లుకు చెందిన కురుబ ఈశ్వర్ కుటుంబ సభ్యులు ఐదుగురు ఎద్దుల బండిపై శనగపప్పు కట్టిన పీకడానికి బయలుదేరారు. భారత్ పెట్రోల్ బంకు వద్ద తమ పొలం వైపు బండెద్దులను తోలుకొని వెళ్తున్న సమయంలో అనంతపురం వైపు నుంచి అతివేగంగా వచ్చిన లగేజీ బొలెరో వాహనం ఎద్దుల బండిని ఢీ కొట్టింది. దీంతో రెండు ఎద్దులు అక్కడికక్కడే చనిపోయాయి. ఈశ్వర్ తమ్ముడి భార్య రాజమ్మ తీవ్రంగా గాయపడింది. దీంతో రాజమ్మను అనంతపురంకు తరలించారు. మిగతా వారు స్వల్పగాయాలతో బయటపడ్డారు. బొలెరో డ్రైవర్ సంతోష్‌తో పాటు మరో నలుగురు వాహనంలో ఉన్నారు. వారంతా దొంగల ముఠా అని తెలిసింది. పరారవుతున్న వారిని పోలీసులు చాకచక్యంగా పట్టుకొని విచారిస్తున్నారు. బొలెరోలో ఏడు గొర్రెలు దొంగిలించుకొని తీసుకెళ్తున్నట్లు తెలిసింది. వీరంతా కర్ణాటక రాష్ట్రానికి చెందిన వారని సమాచారం. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టారు.

రైల్వే సమస్యలు పరిష్కరించండి


డీఆర్‌ఎంకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

గుంతకల్లు: డివిజన్ పరిధిలోని రాజంపేట, రైల్వే కోడూరు నెలకొన్న రైల్వే పరమైన సమస్యలను పరిష్కారించాలని డీఆర్‌సీసీ మెంబర్ భరత్‌కుమార్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గుంతకల్లు డీఆర్‌ఎం కార్యాలయంలో డీఆర్‌ఎం మనీష్ అగర్వాల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల పొడిగించిన రేణిగుంట – నంద్యాల డెమో రైలుకు అన్ని రైల్వేస్టేషన్లలో స్టాపింగ్ కల్పించాలన్నారు. కరోనా ముందు రాజంపేట, రైల్వేకోడూరు రైల్వేస్టేషన్లలో ఆగుతున్న హరిప్రియా ఎక్స్‌ప్రెస్, చెన్నై సెంట్రల్ మెయిల్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను తిరిగి నిలిపేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఓబులవారిపల్లి రైల్వేస్టేషన్‌లో వెంకటాద్రి, తిరుమల ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపేలా చర్యలు తీసుకోవాలన్నారు.

గడువులోగా రోడ్ల నిర్మాణాలు పూర్తిచేయాలి


మాట్లాడుతున్న పీఆర్ సీఈ సుబ్బారెడ్డి

అనంతపురం సిటీ: ఆంధ్రప్రదేశ్ గ్రామీణ రహదారుల అనుసంధాన ప్రాజెక్ట్ కింద చేపట్టిన రహదారుల నిర్మాణాలన్నీ ఏప్రిల్ నెలాఖరుకల్లా పూర్తి చేయాల్సిందేనని పంచాయతీరాజ్ చీఫ్ ఇంజినీర్ ఎస్వీ సుబ్బారెడ్డి ఆదేశించారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో చేపట్టిన రహదారుల నిర్మాణాలను బుధ, గురువారాల్లో ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. అనంతరం అనంతపురంలోని పంచాయతీరాజ్‌శాఖ జిల్లా కార్యాలయంలో గురువారం ఆయన ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లతో సమీక్ష నిర్వహించారు. పంచాయతీరాజ్ శాఖ ఎస్ఈ యమ్మాని భాగ్యరాజ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రాజెక్ట్ ఈఈలు కేవీకేవీ ప్రసాద్, డీఎల్ శ్రీనివాస్, క్వాలిటీ కంట్రోల్ విభాగం ఈఈ మల్లికార్జున మూర్తి, పీఐయూ డీఈఈలు రాచంరెడ్డి భాస్కర్‌రెడ్డి, డీఎల్ మురళీ, హనుమంతశెట్టి, వెంకటేశులు, ఏఈఈలు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

భక్తుల కొంగు బంగారం

- 14వ తేదీ నుంచి అంత్య సుబ్రహ్మణ్యస్వామి బ్రహ్మోత్సవాలు
- 16న బ్రహ్మ రథోత్సవం
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు


అంత్య సుబ్రహ్మణ్యస్వామి మూలవిరాట్

పావగడ: కర్ణాటక రాష్ట్రం అనంతపురం జిల్లా సరిహద్దు నాగలమడక గ్రామంలో ఉన్న అంత్య సుబ్రహ్మణ్యస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 14 నుంచి ప్రారంభం కానున్నాయి. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని అధికారులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. 16న స్వామి వారి బ్రహ్మ రథోత్సవం జరుగనుంది.

ఇసుకలో దొరికాడు... ఇల వేల్పు అయ్యాడు

పూర్వం నాగలమడక గ్రామంలో అన్నంభట్లు అనే బ్రాహ్మణోత్తముడుండేవాడు. ఆయన కుక్కె ఆలయం నుంచి ఇక్కడకు వచ్చి చేరుకున్నాడు. అయితే సుబ్రహ్మణ్యస్వామి అతని కలలో వచ్చి తాను ఏడు పడగల సర్పాకారంలో పక్కనే ఉన్న పెన్నా నదిలో దాగి ఉన్నానని.. తనను వెలికి తీసి పెన్నా ఒడ్డున ప్రతిష్ఠించాలని కోరారట. ఆ మరుసటి రోజే అన్నంభట్లు ఏటిలోని ఇసుకను నాగలితో దున్నగా ఏడు పడగల సర్పాకార శిల నాగలి చాలుకు దొరికింది. అప్పటి నుంచి ఆ గ్రామానికి నాగలమడకగా పేరు వచ్చింది. ఆ ఉద్భవ మూర్తిని ఏటి ఒడ్డున చిన్న బండల గుడి కట్టి ప్రతిష్ఠించాడు. అనంతరం కొన్నాళ్లకు సమీపంలోని ఆంధ్రకు చెందిన రొద్దం గ్రామం నుంచి వ్యాపారి సుబ్బయ్యశెట్టి ఎద్దుల బండిలో వ్యాపార నిమిత్తం బళ్లారికి వెళ్తూ నదీ తీరాన విశ్రమించాడు. తన వ్యాపారం లాభసాటిగా జరిగితే స్వామికి ఆలయం కట్టిస్తానని మొక్కు కున్నాడు. మొక్కు నెరవేరగా సుబ్బయ్యశెట్టి స్వామి వారికి ఆలయం కట్టించాడు. అప్పటి నుంచి నేటి వరకు సుబ్బయ్యశెట్టి వారసులే బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ పూజలు చేస్తున్నారు. ఇసుకలో దొరికిన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి నేడు ఎంతో మంది భక్తులకు ఇల వేల్పుగా మారాడు. సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రసాదంగా పెసర పులగం, వంకాయబజ్జి వంటలను వండుకుని ఆరగించే సంప్రదాయాన్ని నేటికీ పాటిస్తుండటం విశేషం.

14 నుంచి బ్రహ్మోత్సవాలు..

అంత్య సుబ్రహ్మణ్యస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 14న ప్రారంభమై 26న ముగియనున్నాయి. 14న అంకురార్పణ, 15న ధ్వజారోహణ, కల్యాణోత్సవం, బ్రాహ్మణ సంతర్పణం, 16న బ్రహ్మ రథోత్సవాలను నిర్వహించనున్నారు. 17 నుంచి 23 వరకూ సర్వ సేవా పూజలు, అన్నసంతర్పణ , 22న నెమలి వాహన సేవ , 23 నుంచి 26 వరకు సర్వ సేవ, అన్న సంతర్పణంపూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. నాగలమడక జాతరకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎండోమెంట్ అధికారి, తహసీల్దార్ డీఎస్ వరదరాజు తెలిపారు.

అనంత వాసులకు సాహిత్య అకాడమీ అవార్డులు



రమేష్ నారాయణ, గుత్తా హరిలకు అవార్డులు అందిస్తున్న పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి

అనంతపురం కల్చరల్: అనంత వాసులు సాహిత్య అకాడమీ అవార్డులు అందుకున్నారు. జిల్లా ఖ్యాతిని తన రచనాశైలితో ఆకట్టుకుంటూ 60కి పైగా పుస్తకాలను అనంత పాఠక లోకానికి అందించిన డాక్టర్ పతికి రమేష్ నారాయణ, రచయిత్రిగా, కాలమిస్టుగా సేవలందిస్తున్న నల్లాని రాజేశ్వరికి గురువారం ఏలూరు నగరంలో జరిగిన పురస్కార మహోత్సవంలో సాహిత్య అకాడమీ అవార్డులు అందుకున్నారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన రాష్ట్ర సాహిత్య అకాడమీ అధ్యక్షురాలు పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, జాయింట్ కలెక్టర్ లావణ్యవేణి, శ్రీశ్రీ కళావేదిక చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ చేతుల మీదుగా రమేష్ నారాయణ, నల్లాని రాజేశ్వరీ తరుపున గుత్తా హరిసర్వోత్తమనాయుడు అవార్డులు అందుకున్నారు. అనంత జిల్లా సాహిత్యానికి రమేష్ నారాయణ చేసిన స్ఫూర్తిదాయక సేవలను కొనియాడుతూ రూ.10 వేల నగదు, జ్ఞాపిక, ప్రశంసా పత్రం అందించారు.

16న నృసింహుని పార్వేట ఉత్సవం

కదిరి: ఖాద్రీ లక్ష్మీ నరసింహ స్వామి పార్వేట ఉత్సవాన్ని ఈ నెల 16న నిర్వహించనున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ శ్రీనివాసరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఏటా సంక్రాంతి పండుగ మరుసటి దినం పార్వేట ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలో 16వ తేదీ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉదయం నిత్య పూజల అనంతరం స్వామివారు 9 గంటల్లోపు కదిరి కొండకు చేరుకుంటారు.పూజల తర్వాత అక్కడ నుంచి స్వామివారు నేరుగా పాల పొంగుల మండపం చేరుకొని పాలు అరగించి, భక్తులకు కాసేపు దర్శనమిస్తారని ఈఓ వెల్లడించారు. తర్వాత రైల్వే స్టేషన్ వద్ద పార్వేట ఉత్సవం జరుగుతుందన్నారు.

క్లుప్తంగా

వేమన జయంతిని అధికారికంగా నిర్వహించాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రామకృష్ణారెడ్డి తదితరులు

అనంతపురం కల్చరల్: ఈనెల 19న రానున్న ప్రజాకవి వేమన జయంతిని అధికారికంగా నిర్వహించాలని వేమన ఫౌండేషన్ అధ్యక్షుడు ఆచార్య కాడా రామకృష్ణారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక వేమన ఫౌండేషన్ కార్యాలయంలో వేమన పద్య పోటీల పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. ఆచార్య రామకృష్ణారెడ్డి, కేంద్రసాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత అప్పిరెడ్డి హరినాథరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో వేమన ఫౌండేషన్ సభ్యులు ఆచార్య శంకర్‌నాయక్, రవీంద్రరాజు, కృష్ణారెడ్డి, లోకన్న, నాగశేషారెడ్డి పాల్గొన్నారు.

పంపనూరు ఆలయ ఇన్‌చార్జ్ ఈఓగా శోభ



ఆత్మకూరు: పంపనూరు సర్వరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ ఇన్‌చార్జ్ ఈఓగా సాకే తాపురం శోభను గురువారం నియమించారు. గతంలో ఉన్న ఈఓ అక్కిరెడ్డి అనారోగ్య సమస్యలతో సెలవుపై వెళ్లారు.

క్రీడల్లో ఆదర్శంగా నిలవాలి



టాస్ వేసి క్రీడలను ప్రారంభిస్తున్న బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు బాలపోతన్న

ఆత్మకూరు: క్రీడలు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయని వైఎస్సార్‌సీపీ రాప్తాడు నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు బాలపోతన్న తెలిపారు. గురువారం ఆత్మకూరు ఉన్నత పాఠశాలలో క్రీడలను ప్రారంభించారు. అనంతరం మండల స్థాయి క్రికెట్ పోటీల్లో గెలుపొంది నియోజకవర్గ స్థాయిలో ఆడే క్రీడాకారులకు రూ.10,116 అందిస్తానని ప్రకటించారు. గురువారం క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, షటిల్ క్రీడలను నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ విజయ్‌కుమార్ నాయక్, మహేష్, పీడీలు నాగరాజు, జగదీశ్వరరెడ్డి, జగదీష్, పీఈటీ గోవర్దన్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు షోకాజ్ నోటీసులు



ఆత్మకూరులో అంగన్‌వాడీ కేంద్రానికి షోకజ్ నోటీసు అతికిస్తున్న సూపర్‌వైజర్ లావణ్య

ఆత్మకూరు: మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలకు గురువారం షోకాజ్ నోటీసులు అందించినట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లావణ్య, శ్రీవాణి తెలిపారు. మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల వద్ద షోకాజ్ పోటీసులు అతికించామని, పోస్టు ద్వారా పంపించి, అంగన్‌వాడీ కార్యకర్తలకు కూడా నోటీసులు అందించినట్లు తెలిపారు. మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు దాదాపు 80 మందికి షోకాజ్ నోటీసులు అందించారు.

చౌకధాన్యపు దుకాణాల్లో తనిఖీలు



తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

అనంతపురం క్రైం: నగర శివారులోని చంద్రబాబునాయుడు కాలనీలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గురువారం తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో డీలర్లు అరుణ బాయి, ఎస్. గౌరమ్మలపై కేసులు నమోదు చేశారు. రికార్డులు, నిత్యవసరాల నిల్వలో లోపాలు గుర్తించి, కేసులు నమోదు చేశారు. ఎస్‌ఐ జయపాల్‌రెడ్డి, ఫణీంద్రనాథ్‌రెడ్డి, ఏఎ వాసుప్రకాష్ పాల్గొన్నారు.

నేడు ఘంటసాల సంగీత విభావరి

అనంతపురం కల్చరల్: పాత పాటల ప్రేమికులు, అనంత సినీ సంగీత కల్చరల్ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం ఘంటసాల సంగీత విభావరి జరగనుంది. ఈ మేరకు నిర్వాహకులు ఆచార్య సుధాకర బాబు, ఓబుళదాసు ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక హౌసింగ్‌బోర్డులోని రాజు చిల్డ్రన్స్‌పార్కులో నూతనంగా ఏర్పాటైన ఘంటసాల స్మారక మంటపంలో ఆ పాతమధురాలను జిల్లా గాయనీ గాయకులు ఆలపిస్తారన్నారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటు చరిత్రాత్మకం



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మేయర్ వసీం



ప్రతిజ్ఞ చేయిస్తున్న డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య

అనంతపురం కార్పొరేషన్: విజయవాడలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చరిత్రాత్మకమని మేయర్ వసీం పేర్కొన్నారు. ఈ నెల 19న విజయవాడలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతి వనం, కాంస్య విగ్రహావిష్కరణను పురస్కరించుకొని సామాజిక సమతా సంకల్పం సభకు సంఘీభావంగా గురువారం నగరపాలక సంస్థ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి మేయర్ తదితరులు పూలమాల వేసి,నివాళులర్పించారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీసుకున్న గొప్ప నిర్ణయం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. అంబేడ్కర్ సిద్ధాంతాలు, ఆశయాలు, లక్ష్యాలను సీఎం సామాజిక న్యాయం ద్వారా అమలు పర్చారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలకు డిప్యూటీ సీఎం పదవులను ఇవ్వడంతో పాటు కేబినెట్‌లో అధిక ప్రాధాన్యత ఇచ్చిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. అనంతరం మేయర్ ప్రతిజ్ఞ చేయించి, సంతకాలు చేశారు. నగరంలోని వివిధ సచివాలయాల పరిధిలో అంబేడ్కర్ పోస్టర్‌ను ఆవిష్కరించి, నివాళులర్పించినట్లు తెలిపారు. విజయవాడలో జరగనున్న ఈ కార్యక్రమానికి బడుగులందరూ పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాలను పుణికిపుచ్చుకొని సామాజిక సాధికారతను చాటుతున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, కమిషనర్ భాగ్యలక్ష్మి, అదనపు కమిషనర్ రమణారెడ్డి, కార్యదర్శి సంగం శ్రీనివాసులు, ఈఈలు సూర్యనారాయణ, సుధారాణి, డీఈలు సుభాష్, రవీంద్రరెడ్డి, కార్పొరేటర్లు లాలూ, అనిల్‌కుమార్ రెడ్డి, కమల్‌భూషణ్, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలే మార్గదర్శకాలు ..

భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలే మార్గదర్శకాలని, ఆయన స్ఫూర్తితో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలో సామాజిక విప్లవాన్ని తీసుకొచ్చారని డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య పేర్కొన్నారు. గురువారం 13వ డివిజన్‌లో సచివాలయంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక న్యాయ మహా శిల్పం ఏర్పాటు చేయాలని సంతకాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు బండి శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అవార్డులకు ఇద్దరు ఎంపిక

అనంతపురం కల్చరల్: ఈఏడాది కూడా ఎన్‌ఎస్‌ఎస్ విభాగంలో జిల్లాకు చెందిన ఇద్దరు రాష్ట్రస్థాయిలో బహుమతులు అందుకోనున్నారు. రైవర్‌కాలేజ్ ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-1లో ప్రోగ్రాం ఆఫీసర్‌గా సేవలందిస్తున్న నాగశుభ, జేఎన్‌టీయూఏ విద్యార్థిని నందిత శుక్రవారం విజయవాడలో జరగనున్న వేడుకల్లో గవర్నర్ చేతుల మీదుగా రాష్ట్రస్థాయి అవార్డులు అందుకోనున్నారు.

కృత్రిమ కాళ్లు, కాలిఫర్స్..

భారత్ వికాస్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి సందర్భంగా దివ్యాంగులకు కృత్రిమ కాళ్లు, కాలిఫర్స్ అందించనున్నారు. ఉదయం 8 గంటలకు టవర్‌క్లాక్ సమీపంలోని స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పిస్తున్నట్లు తెలిపారు. అనంతరం గీతామందిరంలో జరగనున్న వేడుకల్లో అందరూ పాల్గొనాలని, నిర్వాహకులు పరుచూరి రమేష్ తెలిపారు. నేడు నెహ్రూ యువకేంద్రంతో పాటు పలు యువజన సంఘాల వారు వివేకానంద జయంతిని ఘనంగా నిర్వహించనున్నారు.

వైఎస్సార్‌సీపీని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందాం



సమావేశంలో మాట్లాడుతున్న తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి

కనగానపల్లి/ఆత్మకూరు: రాబోవు అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందామని ఎమ్మెల్యే సోదరులు, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నేతలు తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం తోపుదుర్తి గ్రామంలో వారు కనగానపల్లి మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే సోదరులు మాట్లాడుతూ ప్రకాష్‌రెడ్డి ఎమ్మెల్యే అయిన తర్వాతా రాప్తాడు నియోజకవర్గాన్ని ఫ్యాక్షన్, వర్గ రాజకీయాలకు దూరంగా అభివృద్ధి వైపు నడిపిస్తున్నారన్నారు. గతంలో ఇక్కడ పదేళ్లు ఎమ్మెల్యేగా, ఐదేళ్లు మంత్రిగా పనిచేసిన పరిటాల సునీత ఈ ప్రాంత అభివృద్ధి గురించి ఏ మాత్రమూ పట్టించుకోలేదన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకొచ్చిన తర్వాత కుల, మత, రాజకీయాలకతీతంగా పేదలకు సంక్షేమ పథకాలను అందించటంతో పాటు ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారన్నారు. రాప్తాడులో వైఎస్సార్‌సీపీని మరోమారు గెలిపించుకోవటంతో పాటు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిని చేసుకుందామన్నారు. ఇందుకు గ్రామాల్లోని పార్టీ నాయకులు, కార్యకర్తలు కలసికట్టుగా పనిచేయాలని కోరారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు మారుతీప్రసాద్, ఎంపీపీ భాగ్యమ్మ భర్త నాగముని, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అమరనాథరెడ్డి, డైరెక్టర్ ప్రభాకర్, నాయకులు సుధీర్‌రెడ్డి, ముత్యాలు, పెద్దిరెడ్డి, రవి, పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

'రాగుల సీమ'కు ప్రతిభా పురస్కారం



రాగుల సీమ

అనంతపురం కల్చరల్: గుంటూరు రావి రంగారావు సాహిత్య పీఠం అందించనున్న జన రంజక కవి ప్రతిభా పురస్కారాలను గురువారం ప్రకటించారు. అనంతవాసి యాములపల్లి నరిసిరెడ్డి రచించిన దీర్ఘకవిత 'రాగులసీమ' అవార్డుకు ఎంపిక య్యింది. ఫిబ్రవరి 14న గుంటూరులో జరగనున్న పురస్కార ప్రదానోత్సవంలో పలువురు సాహితీవేత్తల చేతుల మీదుగా నరిసిరెడ్డి నగదు బహుమతి, జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందుకుంటారు.

110 జీఓ అమలు చేయాలని మంత్రికి వినతి



మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలిసిన అకడమిక్ కన్సల్టెంట్లు

అనంతపురం: 110 జీఓ అమలు చేయాలని శ్రీకృష్ణ దేవరాయ విశ్వ విద్యాలయంలో పనిచేస్తున్న అకడమిక్ కన్సల్టెంట్లు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి గురువారం విన్నవించారు. కొండూరు పంచాయతీ పార్టీ సమన్వయ కమిటీ సమావేశంలో కలిసి అకడమిక్ కన్సల్టెంట్ల ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ కొన్నేళ్లుగా యూనివర్సిటీలో 80 మందికి పైగా అకడమిక్ కన్సల్టెంట్లుగా పని చేస్తున్నామన్నారు. గంటల ప్రకారంగా వేతనం ఇస్తున్నారన్నారు. రాష్ట్రంలోని పలు వర్సిటీల్లో 110 జీఓ అమలు చేసి నెలవారి వేతనం ఇస్తున్నారన్నారు. తమకు ఇంతవరకు జీఓను అమలు చేయలేదన్నారు. ఉన్నత విద్యను అభ్యసించి చాలీ చాలని జీతాలకు పని చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వర్సిటీ అకడమిక్ కన్సల్టెంట్ల కన్వీనర్ సయ్యద్ హుస్సేన్, అకడమిక్ కన్సల్టెంట్లు జయచంద్రరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, వీరరాజు, కమలాకర్, కరుణాకర్, జమ్మన్న, ఆదిశేఖర్‌రెడ్డి, సాకే రాజు, గణేష్, గురుమూర్తి పాల్గొన్నారు.

రేనాటి వీరుడు వడ్డే ఓబన్న



వడ్డే ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం



ఆత్మకూరులో వడ్డే ఓబన్న జయంతి నిర్వహిస్తున్న దృశ్యం

అనంతపురం టవర్‌క్లాక్: బ్రిటీష్ వారిని ఎదురించిన స్వాతంత్ర్య సమరయోధుడు, రేనాటి వీరుడు వడ్డే ఓబన్న అని రుద్రంపేట వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు అన్నారు. గురువారం స్థానిక రుద్రంపేట బైపాస్ సర్కిల్‌లో వడ్డే ఓబన్న జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. రుద్రంపేట వడ్డెర సంఘం కార్యాలయం నుంచి టవర్‌క్లాక్ వరకు సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వడ్డెర సంఘం నాయకులు సంజీవరాయుడు, సుధాకర్, వెంకటేష్, వేణుగోపాల్, నెట్టికంటి, సంజీవులు, ధనుంజయ, నాగేంద్ర, రాజశేఖర్ పాల్గొన్నారు.

ఆత్మకూరులో...

ఆత్మకూరు: మండల కేంద్రంలో వడ్డే ఓబన్న జయంతి వేడుకలను గురువారం నిర్వహించారు. వడ్డే కమ్యూనిటీ భవనం వద్ద వడ్డే ఓబన్న జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేశారు. కార్యక్రమంలో వడ్డెర సంఘం నాయకులు, వడ్డెర్లు పాల్గొన్నారు.

ఇంటింటా శ్రీరాముడి అక్షింతలు పంపిణీ



అక్షింతలు పంపిణీ చేస్తున్న భజన బృందం సభ్యులు

కనగానపల్లి: మండలంలోని మామిళ్లపల్లి గ్రామంలో అయోధ్య శ్రీరాముడి అక్షింతలను భక్తులు గురువారం ఇంటింటా పంపిణీ చేశారు. గ్రామంలోని భజన బృందం సభ్యులు శ్రీరామ కీర్తనలను పాడుకుంటూ ఊరేగింపుగా వెళ్లి, వీటిని భక్తులకు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, సీతారామాంజనేయ భజన బృందం సభ్యులు పాల్గొన్నారు.

'ఉయ్యాలవాడ'ను ఆదర్శంగా తీసుకోవాలి



ఏపీ రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

అనంతపురం టవర్‌క్లాక్: స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవితాన్ని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంగులకుంట నరేష్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక ఆర్ట్స్ కళాశాల ఎదురుగా ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నరేష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ అనివార్య కారణాల వల్ల విగ్రహావిష్కరణకు అడ్డంకులు కలిగాయని, స్వాతంత్ర సమర యోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహావిష్కరణను రాజకీయం చేస్తున్నారని, సరైన పద్ధతికాదన్నారు. స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను సైతం అర్పించిన ఆయన్ను యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. రెడ్డి బంధువులకు, అభిమానులకు ఇది ఒక గొప్ప పండుగ అన్నారు. కార్యక్రమంలో రెడ్డి సంఘం నాయకులు రాజారెడ్డి, బయపరెడ్డి, రామకృష్ణారెడ్డి, చవ్వా హనుమంతరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, హనుమంతరెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సర్వజనాస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స



శస్త్రచికిత్స విజయవంతం అయిన తర్వాత వెంకటేష్‌నాయక్‌తో సూపరింటెండెంట్, వైద్యులు

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో వైద్యులు రూ.లక్షలు ఖర్చయ్యే అరుదైన శస్త్ర చికిత్స చేశారు. వివరాలను గురువారం సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు, సర్జరీ విభాగాధిపతి డాక్టర్ రామస్వామి నాయక్ విలేకరులకు తెలియజేశారు. ఉరవకొండ మండలం రాకెట్ల తండాకు చెందిన వెంకటేష్‌నాయక్ గత నెలలో కరెంటు షాక్‌తో చెట్టుపై నుంచి కింద పడ్డాడు. ఆయాసం, మెడనొప్పితో ఆస్పత్రిలో చేరాడు. అన్ని పరీక్షలు చేసిన వైద్యులు..పేగుకు రంధ్రం పడినట్లు గుర్తించారు. దీంతో సర్జరీ విభాగాధిపతి డాక్టర్ రామస్వామినాయక్, అనస్తీషియా విభాగం ప్రొఫెసర్ డాక్టర్ నవీన్‌కుమార్ బృందం వెంకటేష్ నాయక్‌కు అధునాతన అనస్తీషియా పద్ధతిలో ప్లెయిన్ బ్లాక్స్ ఇచ్చి అత్యవసర ల్యాప్రొటమీను విజయవంతం చేశారు. ప్రైవేట్‌గా ఇలాంటి సర్జరీ చేయాలంటే రూ.6 లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. అనంతరం సూపరింటెండెంట్ సర్జరీ, అనస్తీషియా విభాగం వైద్యులను అభినందించారు.

నాణ్యమైన పరిశోధనలపై దృష్టి సారించాలి



త్యాగరాజన్‌ను సన్మానిస్తున్న వీసీ జింకా రంగ జనార్ధన

అనంతపురం: నాణ్యమైన పరిశోధనలపై దృష్టి సారించాలని జేఎన్‌టీయూ అనంతపురం ప్రొఫెసర్ త్యాగరాజన్ అన్నారు. విశ్వవిద్యాలయం నాక్ (ఎన్ఏఏసీ) మాక్ పీర్ కమిటీ రెండో రోజు కమిటీ అన్నా యూనివర్సిటీ, చెన్నై ఎమిరిటస్ ప్రొఫెసర్ త్యాగరాజన్ ఆధ్వర్యంలో జరిగింది. మెకానికల్ ఇంజనీరింగ్ సెమినార్ హాలులో వీసీతో పాటు ప్రొఫెసర్ త్యాగరాజన్ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో వీసీ జింకా రంగ జనార్ధన్ మాట్లాడుతూ యూనివర్సిటీలో కళాశాలలోని అన్ని విభాగాలలో నాక్ కమిటీ సందర్శించినదని తెలిపారు. అన్ని విభాగాలను క్షుణ్ణంగా కమిటీ వారు పరిశీలించారన్నారు. ప్రతి అధ్యాపకుడి సహకారంతోనే మంచి గ్రేడ్ సాధించగలమన్నారు. నాక్ పీర్ కమిటీ సభ్యులు యూనివర్సిటీ మరింత అభివృద్ధి చెందడానికి సూచనలు, సలహాలు ఇచ్చారన్నారు. అన్నా యూనివర్సిటీ, చెన్నై ఎమిరిటస్ ప్రొఫెసర్ త్యాగరాజన్ మాట్లాడుతూ వివిధ క్రైటీరియాల్లో స్కోర్లను ఎలా పెంచుకోవాలో వివరించారు. వీటికి తగిన ప్రణాళికను వివరించారు. ముఖ్యంగా టీచింగ్ - లెర్నింగ్, రీసెర్చ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, అలుమ్ని కాంట్రిబ్యూషన్ అంశాలపై ఎక్కువ దృష్టి సారించాలన్నారు. నాక్‌కు ఇంకా మంచి గ్రేడ్ వచ్చే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. రెండో రోజు గురువారం కళాశాలలో మెకానికల్ విభాగం, ఎంబీఏ, ఓటీపీఆర్ఐ, స్పోర్ట్స్ కౌన్సిల్, సివిల్ విభాగం, కెమికల్ విభాగం, డిస్పెంసరి విభాగాలను సందర్శించి, పలు సూచనలు ఇచ్చారు. అనంతరం ఆచార్య త్యాగరాజన్‌ను వీసీ సన్మానించారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య విజయ కుమార్, ఐక్యూఏసీ డైరెక్టర్ ఆచార్య జీవీ సుబ్బారెడ్డి, యూనివర్సిటీ డైరెక్టర్లు, అనంతపురం కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్‌వీ సత్యనారాయణ, పులివెందుల, కలికిరి కళాశాల ప్రిన్సిపాళ్లు, వైస్ ప్రిన్సిపాళ్లు, అనంతపురం, పులివెందుల, కలికిరి కళాశాలల హెచ్ఓడీలు, బోధన సిబ్బంది, కోఆర్డినేటర్లు, అడహక్ సిబ్బంది, బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు ప్రభుత్వం పెద్దపీట



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ నాయకులు

అనంతపురం కార్పొరేషన్: అంగన్‌వాడీలకు ప్రభుత్వం పెద్దపీట వేసిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కొర్రపాడు హుస్సేన్‌పీరా, ప్రధాన కార్యదర్శులు వనారస బలరాం, గౌస్‌పీరా పేర్కొన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. విధి నిర్వహణలో మంచి పనితీరు కనబర్చిన అంగన్‌వాడీ వర్కర్లకు, హెల్పర్లకు ప్రోత్సాహకంగా నెలకు రూ.500 అదనంగా చెల్లించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఇందుకోసం ఏడాదికి సుమారు రూ.28.8 కోట్లు చెల్లిస్తోందన్నారు. సూపర్‌వైజర్ పోస్టులకు పరీక్షలు రాసేందుకు వయో పరిమితిని 45 ఏళ్ల నుంచి 50 ఏళ్లకు పెంచి ఎక్కువ మందికి అవకాశం కల్పించిందన్నారు. అంగన్‌వాడీ వర్కర్లకు స్మార్ట్‌ఫోన్లు అందించిందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను ఒకే గొడుగు కింద తీసుకువచ్చి రూ.16 కోట్ల ఖర్చుతో వర్కర్, హెల్పర్లకు 6 చొప్పున యూనిఫాంలను అందించిందన్నారు. గత టీడీపీ ప్రభుత్వం అంగన్‌వాడీలను పట్టించుకోలేదన్నారు. అంగన్‌వాడీలు ఆందోళన పేరుతో ప్రభుత్వ పెద్దలను కించపరిచే విధంగా మాట్లాడడం సరికాదన్నారు. సమావేశంలో కార్యదర్శులు గంపయ్యదాసరి, పుల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ప్రసాద్

అనంతపురం కార్పొరేషన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాయీ బ్రాహ్మణ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా జే ప్రసాద్‌ను నియమిస్తూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అనంతరాము గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణులకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సామాజిక, ఆర్థిక, రాజకీయంగా నాయీ బ్రాహ్మణులు అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకున్నారని తెలిపారు.

గొర్రెల అపహరణ

గార్లదిన్నె: కల్లూరులో బుధవారం అర్ధరాత్రి 15 గొర్రెలను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన ఆంజనేయులు గ్రామంలో ఆంజనేయ స్వామి ఆలయ సమీపంలో గొర్రెలు మందతో నిద్రించాడు. అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు ఆంజనేయులుపై దాడి చేసి 15 గొర్రెలను వ్యానులో ఎత్తుకెళ్లారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలం వద్దకు వెళ్లి దుండగులు ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఇదిలా ఉండగా గురువారం తెల్లవారుజామున విడపనకల్లు మండలంలో గొర్రెలు దొంగలించుకెళ్తున్న వ్యాన్ బోల్తాపడినట్లు గార్లదిన్నె పోలీసులకు సమాచారం అందింది. నిందితులు కర్ణాటకకు చెందిన వారిగా గుర్తించినట్లు సమాచారం .

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

అనంతపురం క్రైం: అక్రమంగా మద్యం తీసుకెళ్తున్న రామానాయుడు అనే వ్యక్తిని టూ టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం రాత్రి వాహనాలు తనిఖీ చేస్తుండగా, సెవెన్‌హిల్స్ కాలనీకి చెందిన రామానాయుడు ద్విచక్ర వాహనంపై 15 మద్యం బాటిళ్లను తీసుకెళ్తూ పట్టుబడ్డాడు. ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసి, నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

జూదరుల అరెస్ట్

తాడిపత్రి: మార్కెట్ యార్డు సమీపంలో జూదమాడుతున్న ఏడుగుని గురువారం అరెస్ట్ చేసినట్లు ట్రైనీ డీఎస్పీ హేమంత్ కుమార్ తెలిపారు. నిందితులు ఆదినారాయణరెడ్డి, గంపయ్య, రామకృష్ణారెడ్డి,హనుమంతరెడ్డిలతో పాటు మరో ముగ్గురి నుంచి రూ. 26 వేలు స్వాధీనం చేసుకున్నామన్నారు.

మిరప యాజమాన్యంపై అవగాహన అవసరం

- శిక్షణలో వ్యవసాయ, ఉద్యాన అధికారులు



మాట్లాడుతున్న డీఏఓ ఉమామహేశ్వరమ్మ



హాజరైన వీహెచ్ఏలు

అనంతపురం అగ్రికల్చర్: మిరప యాజమాన్యంపై అవగాహన అవసరమని వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు తెలిపారు. మిరపసాగు విస్తరిస్తున్న నేపథ్యంలో క్షేత్రస్థాయిలో రైతులకు మెరుగైన సలహాలు ఇవ్వడానికి వీలుగా సాగు పద్ధతులు, మేలైన యాజమాన్యం గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. గురువారం స్థానిక ప్రాంతీయ ఉద్యాన శిక్షణా కేంద్రంలో మిలిండా బిల్‌గేట్స్ ఫౌండేషన్, డిజిటల్ గ్రీన్ ఆధ్వర్యంలో 'ఈ-మిర్చి' అనే అంశంపై విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్స్ (వీహెచ్ఏ)కు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి (డీఏవో) ఉమమాహేశ్వరమ్మ, ఉద్యానశాఖ డీడీ రఘునాథరెడ్డి, ఏడీ బీఎంవీ నరసింహారావు, ఏపీఎంఐపీ పీడీ జి.ఫిరోజ్‌ఖాన్, వ్యవసాయశాఖ ఏడీ ఎం.రవి, హెచ్‌వో రత్నకుమార్, ఈ-మిర్చి రాష్ట్ర ప్రోగ్రాం కో ఆర్డినేటర్ సురేంద్ర తదితరులు హాజరై సాగు పద్ధతులు, చీడపీడలు, తెగుళ్లు, నివారణ చర్యలు, మార్కెటింగ్ అంశాలపై తెలియజేశారు. పంట సాగు పద్ధతుల గురించి పూర్తిస్థాయి పరిజ్ఞానం కలిగి ఉంటే క్షేత్రస్థాయిలో రైతులకు మేలు జరుగుతుందన్నారు. మిరప సాగు చేసే రైతులను గుర్తించి ఆధునిక సాగు పద్ధతులు, సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకుని రైతులకు ఎప్పటికప్పుడు వాయిస్, టెక్స్ట్ మెసేజ్ రూపంలో అప్రమత్తం చేయడంపై దృష్టి పెట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా మిరప రైతులను ప్రోత్సహిస్తోందని, నీటి వసతి కింద సాగు చేస్తున్న మిరపకు ఏటా వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం వర్తింపజేసి, నిబంధనల మేరకు పెద్ద ఎత్తున పరిహారం కూడా అందిస్తోందని గుర్తు చేశారు. అన్నింటా పరిజ్ఞానం పెంపొందించుకొని ఆర్‌బీకే స్థాయిలో రైతులకు అందుబాటులో ఉండాలని సూచించారు.